నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, ఆదివారం 29 సెప్టెంబర్ 2024 | SURYAPET

సర్టిఫికెట్ల పరిశీలనకు ఈ రోజూ చాన్స్

- కొనసాగుతున్న డీఎస్సీ

2008 అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

రామగిరి, సెప్టెంబర్ 28 : డీఎస్సీ 2008కి ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో కొనసాగుతున్నది. జిల్లా వ్యాప్తంగా 391 మంది ఎంపికైనట్లు డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ అధికారులు వెబ్‌సైట్‌లో జాబితాను అందుబాటులో ఉంచగా.. శుక్రవారం 96మంది, శనివారం 28మంది అభ్యర్థులు కలిసి సర్టిఫికెట్ల పరిశీలన పూర్తి చేసుకున్నట్లు డీఈఓ భిక్షపతి తెలిపారు. అక్టోబర్ 5 వరకు పరిశీలన కొనసాగుతుందని చెప్పారు. జాబితాలోని అభ్యర్థులు విధిగా హాజరువాలని సూచించారు. నేడు ఆదివారం కూడా మధ్యాహ్నం వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు.

అక్టోబర్ 1న డీఈఈ సెట్ సర్టిఫికెట్ పరిశీలన

రామగిరి, సెప్టెంబర్ 28 : డిప్లొమో ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమో ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి నిర్వహించిన డీఈఈ సెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన అక్టోబర్ 1న నిర్వహించనున్నట్లు డైట్ ప్రిన్సిపాల్ కానుగుల నరసింహ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 2024లో నిర్వహించిన సర్టిఫికెట్ పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులు మాత్రమే డైట్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటలకు హాజరై సర్టిఫికెట్ల పరిశీలన చేసుకోవాలన్నారు. అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్, కులం, ఆదాయం, ఆధార్‌కార్డు తీసుకుని రావాలని తెలిపారు.

సద్దుల చెరువు కింది ప్రాంతం ఎఫ్‌టీఎల్ పరిధి కానే కాదు

ప్రభుత్వ బాధ్యతారాహిత్యంతో స్థానికుల్లో భయాందోళనలు

- సర్కారు తొందరపాటు నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు తప్పవు
- నా ప్రాణం పోయినా ఈ దుర్మార్గాన్ని ఆపి తీరుతా
- సూర్యాపేట 30, 42, 43 వార్డుల్లో పర్యటించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- మీరే కాపాడాలంటూ వేడుకున్న ప్రజలు
- నేనున్నానంటూ ధైర్యం చెప్పిన గుంటకండ్ల

సద్దుల చెరువు కింది ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు ధైర్యం చెబుతున్న మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 28 : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు కట్ట ప్రాంతం కట్ట కంటే కిందికి ఉంటుందని, టెక్నికల్‌గా ఇది ఆనాడు ఎఫ్‌టీఎల్ అని పడి ఉంటుంది తప్ప వాస్తవంలో ఆ పరిస్థితి లేదని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి అన్నారు. ఎఫ్‌టీఎల్ పేరుతో మార్కింగ్‌లు ఇస్తూ ప్రజలను ఎందుకు భయపెడుతున్నారని ప్రశ్నించారు. తన ప్రాణం పోయినా ఈ దుర్మార్గాన్ని ఆపి తీరుతానని స్పష్టం చేశారు. నాలుగు రోజుల నుంచి సద్దుల చెరువు ప్రాంతాల్లో అధికారులు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ సర్వే చేస్తుండడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతుండడం తెలుసుకున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి శనివారం వారి నివాసాల వద్దకు వెళ్లి భరోసానిచ్చారు. 30, 42, 43వ వార్డుల్లో పర్యటించి నేనున్నానంటూ ప్రజలకు ధైర్యం చెప్పారు. జగదీశ్‌రెడ్డిని చూసి స్థానిక ఒక్కసారిగా దుఃఖం వెల్లదీస్తూ తమ బాధను వినిపించారు. అప్పట్లో ఎంత కష్టం చేసి భూములు కొన్నది, ఇండ్లు కట్టుకున్నది వివరించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పందిస్తూ.. ఇక్కడి పరిస్థితులపై తనకు అవగాహన ఉందని, మీ ఇండ్లకు ఏమీ కాదని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యాపేటలోని 30, 42, 43వ వార్డులు సద్దుల చెరువు కింది ప్రాంతాలు అని, ఇక్కడ చెరువు కట్టను కూడా ప్రభుత్వమే నిర్మించిందని తెలిపారు. ఇక్కడికి ఎన్నడూ ఒక చుక్క నీరు రాలేదని, స్థానికంగా మూడు ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. వాటిని మించి 500 మీటర్ల వరకు ఇండ్లు కూలగొడుతామంటే ఊరుకునేది లేదన్నారు. ఇక్కడ ఇండ్లను కూలగొడితే వెయ్యి కోట్లకుపైగా నష్టం వాటిల్లుతుందని, ఇది నీరు నిలిచే ప్రాంతం కాదని పేర్కొన్నారు. ఎఫ్‌టీఎల్ కట్ట కంటే పైకి ఉంటుందని, కానీ ఈ ప్రాంతం కట్టకు దిగువన ఉంటుందని తెలిపారు. టెక్నికల్‌గా ఆనాడు ఎఫ్‌టీఎల్ అని పడి ఉంటుంది తప్ప వాస్తవానికి ఎఫ్‌టీఎల్ పరిధి కాదని వివరించారు. మార్కింగ్ ఇస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తామంటూ చూస్తూ ఊరుకోబోమన్నారు. ఇక్కడి ప్రజలు భూమి కొనుక్కొని గుడిసెలు వేసుకుని ప్రభుత్వానికి డబ్బు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. నాడు 'మేం ప్లాట్లు కొని మోసపోయాం. ఎవరో వచ్చి మాది అంటే కొన్నామని చెప్తే.. అధికారులు ఎవరి దగ్గర కొన్నది మాకు తెల్వదు.. ప్రభుత్వానికి డబ్బు కడితే రిజిస్ట్రేషన్ చేస్తామంటే తిరిగి రెండోసారి డబ్బు కట్టి రిజిస్ట్రేషన్ చేసుకున్నారు' అని గుర్తు చేశారు. ఇక్కడ ప్రతి ఇంట్లో శ్రమజీవుల కష్టం ఉందని, చిన్న చిన్న గుడిసెలు వేసుకుని అప్పుడింత అప్పుడింత ఇల్లు కట్టుకుంటే.. ఇప్పుడు హైడ్రా పేరుతో కూల్చివేతలకు పాల్పడుతామంటే.. ఆ దుర్మార్గాన్ని సాగనివ్వనన్నారు. సూర్యాపేట ఎమ్మెల్యేగా ప్రాణం పోయినా ప్రజల వెంట ఉండి ఈ దుర్మార్గాన్ని ఆపుతానన్నారు. ఏ సుప్రీంకోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దుర్మార్గం చేస్తుందో.. అక్కడికి కూడా వెళ్తామన్నారు. తప్పు మీరు చేసి ప్రజలు శిక్ష వేస్తామంటే ఊరుకునేది లేదన్నారు. సర్కారు బాధ్యతారాహిత్యంతో ప్రజలకు కంటి మీద కనుకు కరువైందని, ప్రభుత్వం ఇలాంటి పనికిమాలిన పనులు ఆపి ఒక శాస్త్రీయమైన నిర్ణయం చేయాలని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న చెరువులు, కుంటలు, నాలాల ఎఫ్‌టీఎల్ బఫర్‌ను నిర్ణయించాలన్నారు. అనంతరం అక్కడి పరిస్థితులను బట్టి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రజలకు నష్టం జరిగేందుకు కారణం ప్రభుత్వ శాఖలే అయినప్పుడు ప్రభుత్వమే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తాను ఎమ్మెల్యే అయ్యాక సూర్యాపేటలోని మూడు మూడు చెరువుల్లో ఎఫ్‌టీఎల్ లెవల్‌లో నీరు నిలబెట్టి భవిష్యత్‌లో ఎలాంటి ప్రమాదాలూ రాకుండా ఎక్కడా నూతన నిర్మాణాలు జరుగకుండా చేశానన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏదైతే మార్కింగ్ పెట్టమని చెప్పిందో ఆ ప్రాంతం ఎఫ్‌టీఎల్ కానే కాదని చెప్పారు. ఈ విషయంలో తొందరపాటు నిర్ణయం తీసుకుంటే ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని కలెక్టర్‌ను కలిసి వివరిస్తానన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్ పుట్ట కిశోర్, కౌన్సిలర్ పల్స మహాలక్ష్మి, మున్సిపల్ కో అప్షన్ సభ్యురాలు బత్తుల రూన్సీ, బీఆర్ఎస్ నాయకులు అంగిరేకుల నాగార్జున, రమేశ్ ఉన్నారు.

రెండుగా చీలిన కాంగ్రెస్

మిర్యాలగూడపై పట్టు కోసం నేతల పాట్లు

- చైర్మన్ వర్సెస్ ఎమ్మెల్యేగా చీలిన కౌన్సిలర్లు
- ఇప్పటివరకూ ఏకఛత్రాధిపత్యం సాగించిన చైర్మన్ భార్గవ్
- ఇప్పుడు చైర్మన్‌ను పక్కన పెట్టి అన్నీ తానే అంటున్న ఎమ్మెల్యే బీఎల్ఆర్
- మిర్యాలగూడలో తారాస్థాయికి చేరిన వర్గపోరు

మిర్యాలగూడ, సెప్టెంబర్ 28 : మిర్యాలగూడ కాంగ్రెస్ పార్టీలో రాజకీయం రాజకీయ చైతన్యానికి పేరొందిన మిర్యాలగూడలో రాజకీయాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. తెలంగాణ ఏర్పడిన తొలినాళ్లలోనే కాంగ్రెస్ హవాను కొనసాగించిన ఈ నియోజకవర్గంలో నాయకుల పార్టీ ఫిరాయింపులతో ఒక్కసారిగా రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. కాంగ్రెస్ శ్రేణులు భారీగా బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో నియోజకవర్గం గులాబీమయంగా మారింది. పది సంవత్సరాలు అధికారంలో ఉన్న అధికార పార్టీ ఆ పార్టీ నేతనే ఎమ్మెల్యేగా ఉండడంతో రాజకీయ చక్రాన్ని తిప్పారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలే గులాబి నాయకులు, కార్యకర్తలుగా మారిపోయారు. ఆ సమయంలో పట్టు కోసం పాకులాడిన కాంగ్రెస్ గత ఎన్నికల్లో సత్తా చాటడంతో మళ్లీ అధికారంలో వార్ మొదలైంది.

పాత, కొత్త అనే నినాదంతో నాయకులు ఎవరికి వారే యమునా తీరేగా వ్యవహరిస్తున్నారు. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యే నియోజకవర్గంలో తన పట్టు కోసం రాజకీయ వ్యూహంలో భాగంగా తనకు వ్యతిరేకంగా పనిచేసి ఇప్పుడు కాంగ్రెస్‌లో చేరిన నాయకులను అణచివేసే పనిలో రాజకీయ చక్రం తిప్పుతున్నారు. ఈ నేపథ్యంలో మిర్యాలగూడలో అధికార పార్టీలోనే రోజుకో పరిణామం చోటు చేసుకోవడంతో ప్రజల్లో తీవ్ర చర్చ కొనసాగుతుంది.

ఎమ్మెల్యే వర్సస్ చైర్మన్

మిర్యాలగూడ నియోజకవర్గానికి ఆయువు పట్టుగా ఉన్న మిర్యాలగూడ పట్టణంలో 48 వార్డులు ఉన్నాయి. 90వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే ఈ పట్టణంలో అధికార పార్టీ ఎమ్మెల్యే, చైర్మన్ పట్టు కోసం పోటీ పడుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండడం, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి కూడా అదే పార్టీ నుంచి గెలుపొందారు. గత మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి గెలుపొందిన 18 మంది కౌన్సిలర్లు బీఎల్ఆర్ తరపున ఉన్నారు. మరొక బీఆర్ఎస్ కౌన్సిలర్, మరో కమ్యూనిస్టు పార్టీ కౌన్సిలర్ అసెంబ్లీ ఎన్నికల సమయంలోనే కాంగ్రెస్‌లో చేరడంతో ఎమ్మెల్యే వర్గంలో కౌన్సిలర్ల సంఖ్య 23కు చేరుకుంది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు బీఆర్ఎస్ పార్టీలో ఉన్న మున్సిపల్ చైర్మన్‌తోపాటు ఆయన వర్గానికి చెందిన 13 మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. వారి చేరికను ముందునుంచే వ్యతిరేకించిన ఎమ్మెల్యే, ఆయన అనుచరులతోపాటు మిర్యాలగూడకు చెందిన డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ కూడా వ్యతిరేకించినా.. పార్టీ పెద్దల సూచనల మేరకు ఒకే చెప్పాల్సి వచ్చింది. ఇక అప్పటి నుంచే అసలు కథ మొదలైంది.

సభా వేదికలపై అవమానం.. దూరంగా చైర్మన్

ఎమ్మెల్యే, చైర్మన్ మధ్య వార్ వాతావరణం ఇటీవల ప్రభుత్వ కార్యక్రమాల్లో బహిర్గతం అవుతున్నది. సభా వేదికలపైకి మున్సిపల్ ప్రథమ పౌరుడు అయిన చైర్మన్‌ను పిలువకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆగస్టు 15న ఎన్ఎస్‌పీ క్యాంప్ గ్రౌండ్‌లో 100 అడుగుల జాతీయ జెండాను ఎగురవేయగా అక్కడికి హాజరైన చైర్మన్ భార్గవ్‌ను సభా వేదికపై పిలువకపోవడంతో అవమానానికి గురయ్యాడు. ఇటీవల పట్టణంలోని వై జంక్షన్ వద్ద రూ.150కోట్లతో నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి శంకుస్థాపనకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరు కాగా.. ఆ వేదికపై ఉన్న ఫ్లెక్సీలో చైర్మన్ ఫొటోను ప్రత్యేకంగా ఓ బాక్స్‌లో వేసి అతికించినట్లు ఉండడం పలువురు చర్చించుకున్నారు. ఆ కార్యక్రమానికి చైర్మన్ హాజరు కాలేదు. రెండు రోజుల క్రితం ఎమ్మెల్యే చైర్మన్‌కు తెలియకుండా మున్సిపాలిటీలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సబ్ కలెక్టర్‌ను ఆహ్వానించి సమస్యలను చెప్తే పరిష్కరిస్తామని, పట్టణాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లి నెం.1గా మార్చాలని సూచించారు. ఆ సమయంలో చైర్మన్ మాటను ఎవరూ వినవద్దని, తాను చెప్పిన విధంగానే చేయాలని అధికారులకు, సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం. దాంతో చైర్మన్ శుక్రవారం అత్యవసరంగా సాధారణ సమావేశం నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులను ఆహ్వానించగా ఎమ్మెల్యే వర్గానికి చెందిన కౌన్సిలర్లు ఎజెండా లోపభూయిష్టంగా ఉందని వాకౌట్ చేసి వెళ్లిపోయారు. వారితోపాటు ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు కూడా వాకౌట్ చేయడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసింది. రోజురోజుకూ మారుతున్న పరిణామాలతో ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ మధ్య వార్‌ను మరింత బహిర్గతం చేస్తున్నాయి.

మున్సిపాలిటీలో ఆధిపత్యం కోసం..

మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ బీఆర్ఎస్ నుంచి గెలుపొందగా.. ప్రస్తుత ఎమ్మెల్యే బీఎల్ఆర్ అప్పుడు కౌన్సిలర్‌గా గెలిచి కౌన్సిల్ సభ్యుల్లో ఒకరిగా ఉన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత కౌన్సిలర్ పదవికి రాజీనామా చేశారు. పదేండ్లుగా మిర్యాలగూడ మున్సిపల్ పీఠంపై అధికారాన్ని చెలాయించి ఇబ్బందికర ధోరణిని భార్గవ్ ప్రదర్శించడంతో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీ కౌన్సిలర్లు సైతం గుర్రుగా ఉన్నారు. కాగా, ఇదే కౌన్సిల్‌లో కౌన్సిలర్‌గా ఉన్న బీఎల్ఆర్‌నే ఎమ్మెల్యేగా ఎన్నికవడంతో తనకు వ్యతిరేకంగా ఉన్న చైర్మన్‌ను రాజకీయంగా ఇబ్బందులు పెట్టే ప్రయత్నాల్లో ఉన్నారు. పదేండ్ల పాటు ఏకఛత్రాధిపత్యం సాగించిన చైర్మన్‌ను ఇప్పుడు నామమాత్రపు ప్రజాప్రతినిధిగా మార్చారు. మున్సిపల్ సిబ్బందితోపాటు అధికారులు వద్ద ఆయన మాట చెల్లుబాటు కాకుండా కట్టడి చేశారు. అంతా తన కనుసన్నల్లోనే నడువాలని ఎమ్మెల్యే హుకుం జారీ చేశారు. దాంతో ఇద్దరి మధ్య గ్యాప్ మరిం పెరిగింది.

మాట్లాడుతున్న దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ సులోచన

ఆలయాల్లో నిత్యం ధూప, దీపం నిర్వహించాలి

- ఉమ్మడి జిల్లా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన

రామగిరి, సెప్టెంబర్ 28 : ధూప, దీప, నైవేద్య పథకంలోని ఆయాలల్లో పనిచేసే అర్చకులు విధిగా నిత్యం ఆయా ఆలయాల్లో ధూపం, దీపం నిర్వహించాలని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా అసిస్టెంట్ కమిషనర్ అన్నెపర్తి సులోచన స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నల్లగొండలోని టీఎన్‌జీఓ భవనంలో శనివారం ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు జనగామ జిల్లాలోని ధూప, దీప నైవేద్య పథకం అర్చకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ దేవాదాయ శాఖ పరిధిలో ఉన్న ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులు చేపడితే అనుమతి తీసుకోవాలన్నారు. దేవాలయాలకు దాతలు అందించే విలువైన వస్తువుల, భూముల వివరాలను ఎప్పటికప్పుడు దేవాదాయ శాఖకు తెలుపాలని సూచించారు. ఆయా దేవాలయాలను 43(10) కింద రిజిస్టేషన్ చేసుకోవాలన్నారు. దేవాదాయ శాఖ అమలు చేసే ప్రతి కార్యక్రమంలో డీడీఎన్ అర్చకులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ధూప, దీప, నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలాతాబాద్ వాసుదేవశర్మ, చెర్వుగట్టు దేవస్థానం ప్రధానార్చకుడు డాక్టర్ పోతులపాటి రామలింగేశ్వశర్మ, దేవాదాయ శాఖ సూపర్‌వైజర్లు బి.సుమతి, వెంకటలక్ష్మి, అధికారులు, సిబ్బంది నీరుడు సంతోశ్‌రెడ్డి, నల్లగొండ నిఖిల్, శైలోజు జ్యోతి, పూర్ణచందర్‌రెడ్డి, శిరీష, సునీత పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో మహిళ ప్రసవం

ఆడబిడ్డతో అలివేలు

కోదాడటౌన్, సెప్టెంబర్ 28 : కోదాడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సులో శనివారం ఓ మహిళ ప్రసవించి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. సూర్యాపేట నుంచి కోదాడకు వెళ్తున్న బస్సులో గుడిబండ గ్రామానికి చెందిన అలివేలు ప్రయాణిస్తుంది. మార్గమధ్యంలో పురిటి నొప్పులు రావడంతో డ్రైవర్ బస్సు పక్కకు ఆపి ఇతర మహిళల ఆమెకు సాయం చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. 108కి ఫోన్ చేసి ఆమెను సూర్యాపేట జనరల్ దవాఖానకు తరలించారు. కోదాడ డిపో మేనేజర్ తల్లి బిడ్డ యోగక్షేమాలు తెలుసుకొని డ్రైవర్, కండక్టర్‌ను అభినందించారు.

సత్ఫలితాలిస్తున్న మిషన్ పరివర్తన్

- గాంజా టెస్టింగ్ కిట్లకు పట్టుబడిన 327 మంది
- అవగాహన కల్పించడంతో 321 మందిలో మార్పు

నీలగిరి, సెప్టెంబర్ 28 : నల్లగొండ జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగ నిర్మూలన లక్ష్యంగా చేపట్టిన మిష న్ పరివర్తన్ కార్యక్రమం సత్ఫలితాలు ఇస్తున్నట్లు ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయం, వినియోగంపై దృష్టి సారించి జిల్లా సరిహద్దులు, అంతర్ రాష్ట్ర, జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టుల మాదిరి గాంజా టెస్టింగ్ కిట్లు ద్వారా టెస్టులు చేయగా 327 మంది పట్టుబడ్డారని తెలిపారు. కౌన్సెలింగ్ ద్వారా వారిలో మార్పు వచ్చిందని, రెండో సారి పరీక్షలో 321మందికి నెగెటివ్ వచ్చిందని తెలిపారు. మిగతా ఆరుగురికి పాజిటివ్ రాగా, కామినేని హాస్పిటల్‌లోని డి అడిక్షన్ సెంటర్‌కు పంపి ట్రీట్మెంట్, కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

రాష్ట్రంలో అరాచక పాలన

- వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే హైడ్రా
- నల్లగొండ గడ్డ నుంచి ఫ్లోరోసిస్ భూతాన్ని పారదోలిందే బీఆర్ఎస్
- నెల్లికల్లు లిఫ్ట్ పనులపై మంత్రి స్పష్టత ఇవ్వాలి
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

హాలియా, సెప్టెంబర్ 28 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన సాగిస్తున్నదని, పది నెలల తమ ప్రభుత్వ వైఫల్యాలను కప్పి పుచ్చుకునేందుకే సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రా డ్రామా ఆడుతున్నారని నాగార్జునసాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. శనివారం బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో ఆయన మాట్లాడారు. బఫర్ జోన్‌లో ఉన్న ముఖ్యమంత్రి సొంత సోదరుడి ఇంటిని కూల్చివేయకుండా నోటీసులతో సరిపెట్టిన హైడ్రా పేదల ఇండ్లను ఎందుకు కూలదోస్తున్నదని ప్రశ్నించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలు అమలు చేస్తానని చెప్పిన కాంగ్రెస్ నేతలు అధికారంలోనికి వచ్చి 300 రోజులైనా అమలు చేయలేకపోయారని విమర్శించారు. ఆ సమస్య నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. ఫ్లోరోసిస్ సమస్యపై జిల్లా మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సోయి లేకుండా రోజుకో మాట మాట్లాడుతున్నారన్నారు. గతంలో ఆయన ఎంపీగా ఉన్నప్పుడు పార్లమెంట్ వేదికగా మిషన్ భగీరథ వల్ల నల్లగొండ జిల్లా గడ్డ నుంచి ఫ్లోరోసిస్ భూతం పూర్తిగా పొయ్యిందని చెప్పిందని వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు మంత్రి అయ్యాక ఎస్ఎల్‌బీసీని త్వరగతిన పూర్తి చేసి నల్లగొండ జిల్లా నుంచి ఫ్లోరోసిస్‌ను తరిమివేస్తాననడం హాస్యస్పదంగా ఉందన్నారు. సాగర్ నియోజకవర్గంలోని 24వేల ఎకరాల టేలెండ్ భూములకు సాగునీరు అందించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం నెల్లికల్లు లిఫ్ట్‌కు నిధులు మంజూరు చేస్తే.. మాజీ మంత్రి జానా రెడ్డి మాత్రం 6వేల ఎకరాలకే నెల్లికల్లు లిఫ్ట్ ద్వారా నీళ్లు అందిస్తామనడం విడ్డూరంగా ఉన్నారు. దీనిపై జిల్లా మంత్రి కోమటిరెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టత ఇవ్వడం లేదన్నారు. సాగర్ డ్యామ్ నుంచి 200 టీఎంసీల నీరు వృధాగా సముద్రం పాలైనా.. పక్కనే ఉన్న చెరువులను మాత్రం నింపరని ఎద్దేవా చేశారు. గత ఎన్నికలకు ముందే డీ 8, 9 కెనాల్ పనులు పూర్తయినా నేటికి ఎందుకు సాగునీరు ఇవ్వడం లేదని నిలదీశారు. ఆగస్టు 15లోపుగా రైతులందరికీ రుణమాఫీ చేస్తానన్న రేవంత్ సర్కారు అక్టోబర్‌కు వస్తున్నా సగం మందికి మాఫీ చేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ముగిసినా రైతు భరోసా నిధులు ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

సదరన్ అక్రమాలపై విచారణకు ఆదేశం

- జనరల్ ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 28 : సదరన్ సర్టిఫికెట్ల అక్రమాలపై విచారణ జరిపి నివేదిక అందించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఓపీ రిజిస్టర్, ఏఎంసీ వార్డు, టీ హబ్ డయాగ్నస్టిక్ ల్యాబ్, రేడియాలజీ, ఆల్ట్రా స్కాన్ సెంటర్, సదరం సర్టిఫికెట్ల జారీ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనరల్ ఆసుపత్రి ఆవరణలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. సదరం క్యాంప్, సర్టిఫికెట్ల విషయంలో ఆరోపణలు వస్తున్నాయని, అక్రమాలను ఉపేక్షించేంది లేదని స్పష్టం చేశారు. దవాఖానకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకం పెంచాలన్నారు. ఈ సందర్భంగా పలువురు రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు.

ఆగి ఉన్న ట్రావెల్స్ బస్సును ఢీకొన్న కంటెయినర్

ఇద్దరు ప్రయాణికుల దుర్మరణం

కొయ్యలగూడెం శివారులో ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఢీకొట్టిన కంటెయినర్

చౌటుప్పల్ రూరల్, సెప్టెంబర్ 28 : హైదరాబాద్ - విజయవాడ జాతీయ రహదారిపై ఆగిన ట్రావెల్స్ బస్సు ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు ప్రయాణికులు దుర్మరణం చెందారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీకృష్ణా ట్రావెల్స్‌కు చెందిన బస్సు శుక్రవారం అర్ధరాత్రి విజయవాడ నుంచి ప్రయాణికులతో హైదరాబాద్‌కు బయల్దేరింది. శనివారం తెల్లవారుజామున యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కొయ్యలగూడెం శివారుకు రాగానే బస్సు ఇంజిన్ ఓవర్ హీట్ అవడంతో డ్రైవర్ బస్సును రోడ్డు పక్కన ఆపాడు. హైదరాబాద్ వైపు కంటెయినర్ లారీ ఒకటి వెనుక నుంచి బస్సును ఢీకొట్టడంతో అందులో కూర్చున్న ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృతి చెందారు. తొమ్మిది మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతులు ఖమ్మం జిల్లా కారపల్లి మండలం మాడపల్లి గ్రామానికి చెందిన యజ్జు రవీందర్(24), హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న ఖమ్మం జిల్లా వెంసూరు మండలం వెనచేడువెంకటాపురం గ్రామానికి చెందిన పాల సతీశ్‌కుమార్(46)గా పోలీసులు గుర్తించారు. చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం చేసి మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అందించారు. క్షతగాత్రులకు చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రికి ప్రాథమిక చికిత్స అందించి హైదరాబాద్‌లోని ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
NAMASTE TELANGANA
పదవీవిరమణ శుభాకాంక్షల
ప్రకటనలు
మీ బంధువులు, స్నేహితులు, మీ శ్రేయోభిలాషులలో ఎవరైనా రిటైర్